లెనిన్ శత వర్ధంతి సభను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

ప్రపంచ కార్మిక వర్గ మహానేత, పీడిత ప్రజల విముక్తిదాత, సోవియట్ విప్లవ రథసారధి లెనిన్ శత వర్ధంతి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 2న భీమవరం ఫ్యాడి అండ్ రైస్ మర్చంట్స్ హాల్లో ఉదయం 10 గంటలకు శత వర్ధంతి వేడుకలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, సాహితీ వేత్త, రచయిత కూనపరాజు కుమార్ ముఖ్యవక్తలుగా హాజరౌతారని తెలిపారు. సభకు పార్టీ కార్యకర్తలు, ప్రజాతంత్రవాదులు, మేధావులు, సాహితీవేత్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నిర్మలమ్మ పద్దు పలికేనా..!

పోలవరం నిర్వాసితుల కన్నీటి వ్యథలు.. వేతన జీవుల ఆదాయపు పన్ను కష్టాలు.. కర్షకుల కన్నీటి వేదన, జిల్లాలోని కేంద్రీయ విద్యాసంస్థ నిట్, కొవ్వూరు - భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్లకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లోనైనా నిధుల కేటాయింపు జరిగేనా అంటూ జిల్లా ప్రజానీకంలో విస్తృత చర్చ సాగుతోంది. మోడీ సర్కార్ ఎన్నికల వేళ ప్రవేశ పెడుతున్న బడ్జెట్‌లోనైనా జిల్లాకు న్యాయం జరిగేనా, లేదా అనేది వేచిచూడాలి.

- నేడు పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్
- పునరావాసానికి నిధులిస్తేనే పోలవరం నిర్వాసితులకు మేలు
- రైల్వేలైన్లకు నిధుల కేటాయింపు ఉండేనా
- కష్టాల కడలిలో వ్యవసాయ, ఆక్వా సాగు
- ఆదాయపు పన్ను శ్లాబుల పెంపుపై వేతన జీవుల ఎదురుచూపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం గురువారం పార్లమెంట్‌లో ఎన్నికల వేళ ఓటాన్ అక్కౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది. నిబంధనల ప్రకారం వచ్చే మూడు నెలల ఖర్చుకు సంబంధించి మాత్రమే ఓటాన్ అక్కౌంట్ బడ్జెట్‌లో ప్రస్తావించాల్సి ఉంటుంది. ఎన్నికల్లో గెలిచిన పార్టీ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేశాక పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. గత పరిణామాలు పరిశీలిస్తే మోడీ సర్కార్ ఈ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చేసింది. ఎన్నికల వేళ జరగనున్న బడ్జెట్‌లోనైనా జిల్లాలోని కేంద్ర ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు జరిగేనా అనే చర్చ నడుస్తోంది. కేంద్రం పరిధిలోని పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై ప్రతి బడ్జెట్‌లోనూ నిరాశే మిగులుతోంది. పోలవరానికి నిధుల కేటాయింపులు లేకపోవడంతో నిర్వాసితులకు పరిహారం అందని పరిస్థితి నెలకొంది. పోలవరానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించినప్పుడే నిర్వాసితులకు పరిహారం అందుతోంది. నిర్వాసితులకు రూ.32 వేల కోట్ల వరకూ పరిహారం ఇవ్వాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వం తేల్చింది. కేంద్రం మాత్రం నిధులు ఇవ్వడం లేదు. దీంతో ఏలూరు జిల్లాలోనే 20 వేలకుపైగా నిర్వాసిత గిరిజన కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గోదావరి వరదల సమయంలో నిర్వాసితులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తారో లేదో వేచిచూడాలి.

నిట్‌కు నిధులిచ్చేనా..?

రాష్ట్ర విభజన తర్వాత కేంద్ర విద్యాసంస్థ నిట్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) ఏర్పాటైంది. ఫేజ్-1 పనులు పూర్తయ్యాయి. ఇంకా అనేక పనులు చేయాల్సి ఉంది. అందుకోసం బడ్జెట్‌లో పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో నిట్ అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయి. నిట్‌కు శాశ్వత డైరెక్టర్‌ను కూడా నియమించకపోవడంతో విద్యాసంస్థ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిన పరిస్థితి ఉంది. ఈ బడ్జెట్‌లోనైనా నిట్‌కు పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తారో లేదో చూడాల్సి ఉంది.

రైల్వే లైన్లకు మోక్షం కలిగేనా..!

జిల్లాలో దశాబ్దాల నాటి కలగా కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైను ఉన్నాయి. ఏటా కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్‌కు సంబంధించి తీవ్ర నిరాశ మిగలగా, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌కు అరకొర నిధుల కేటాయింపుతోనే సరిపెడుతున్నారు. దీంతో రైల్వే ప్రాజెక్టులు ముందుకు సాగని పరిస్థితి.

ఆదాయపు పన్ను పెంపుపై వేతన జీవుల ఎదురుచూపు

ఏడాదికి రూ.2.50 లక్షలుగా ఉన్న ఆదాయపు పన్ను పరిమితిని రూ.ఐదు లక్షలకు పెంచాలని వేతన జీవులు కోరుతున్నారు. వేతన జీవులు కోరిన విధంగా కాకుండా గత బడ్జెట్‌లో రూ.ఐదు లక్షల వరకూ ఆదాయపు పన్ను పరిమితిని కల్పిస్తున్నట్లు చెప్పి రూ.ఐదు లక్షల ఆదాయం దాటితే రూ.2.50 లక్షల నుంచి పన్ను చెల్లించాలని నిబంధన పెట్టింది. ఇది వేతన జీవులకు ఏమాత్రమూ ఊరట కలిగించలేదు. ఈ బడ్జెట్‌లోనైనా ఆదాయపు పన్ను పరిమితి రూ.ఐదు లక్షలకు పెంచాలని వేతనజీవులు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల వేళ వేతన జీవులకు ఊరటనిస్తారో, లేదో చూడాల్సి ఉంది.

ఆక్వా, వ్యవసాయ రంగాలకు ఊరట కలిగేనా?

జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు సాగుతోంది. ఆక్వా సాగుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఏమాత్రం మద్దతు లేకుండాపోయింది. మేత ధరలు విపరీతంగా పెంచేసింది. ఆక్వాకు సంబంధించి ధర విషయంలో నిలకడలేని పరిస్థితి కొనసాగుతోంది. ఆక్వా పరిశ్రమను ప్రోత్సహించే విధంగా రాయితీలు కల్పిస్తూ బడ్జెట్‌లో పెట్టాలని ఆక్వారైతులు కోరుతున్నారు. జిల్లాలో అతిపెద్ద సాగు వరి. 80 శాతం ప్రజానీకం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కాంప్లెక్స్ పురుగుమందుల ధర ఏకంగా బస్తా రూ.1700కు చేరింది. పురుగు మందుల ధరల పరిస్థితీ అదేవిధంగా ఉంది. ఎరువుల సబ్సిడీ ధరలు పెంచితే రైతులకు మేలు జరుగుతుంది. వ్యవసాయానికి వెన్నుదన్నులా నిలిచేలా వరికి మద్దతు ధర కల్పించాల్సి ఉంది. బడ్జెట్‌లో ఆక్వా, వరి, పామాయిల్ రైతులకు మేలు జరిగేలా చర్యలుంటాయో లేదో వేచిచూడాలి.

కంటితుడుపే..!

- డిఎస్‌సి విడుదలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం
- ఐదేళ్ల తర్వాత మళ్లీ డిఎస్‌సి
- ఉమ్మడి జిల్లాలో భర్తీ చేసేది 150లోపు పోస్టులే
- 117 జిఒతో తగ్గిపోయిన పోస్టులు
- ఉపాధ్యాయ అభ్యర్థుల్లో తీవ్ర నిరాశ

ప్రజాశక్తి - భీమవరం

ఎట్టకేలకు డిఎస్‌సి విడుదలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అయితే ఇది ఎన్నికల ముందు కేవలం కంటి తుడుపు చర్యగా ఉపాధ్యాయ అభ్యర్థులు అభివర్ణిస్తున్నారు. 117 జిఒతో జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు బాగా తగ్గిపోయాయి. 800 వరకూ భర్తీ కావాల్సిన పోస్టులు ప్రస్తుత డిఎస్‌సిలో కేవలం ఐదు వందలలోపు మాత్రమే భర్తీ కానున్నాయి. దీంతో డిఎస్‌సి కోసం ఐదేళ్లుగా నిరీక్షిస్తున్న ఉపాధ్యాయ అభ్యర్థులకు తీవ్ర నిరాశే మిగిలింది. 2018 తర్వాత మళ్లీ ఇప్పుడే డిఎస్‌సి విడుదలకు ఆమోదం తెలపడం ఎన్నికల నేపథ్యమేననే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఉపాధ్యాయ అభ్యర్థులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డిఎస్‌సి విడుదలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2018 తర్వాత ఐదేళ్లకు డిఎస్‌సి విడుదలకు ఆమోదం లభించిందని తెలియగానే ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. అయితే పోస్టుల సంఖ్య చూడగానే అభ్యర్థుల ఆనందమంతా ఆవిరైంది. ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జిఒతో ఉపాధ్యాయ కొలువులు పెద్దసంఖ్యలో తగ్గిపోయాయి. ఈ జిఒ విడుదల కాకముందు ఉమ్మడి జిల్లాలో సుమారు ఎనిమిది వందల పోస్టుల వరకూ ఖాళీలు ఉన్నాయి. ఈ జిఒ వచ్చిన తర్వాత పోస్టులు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన డిఎస్‌సిలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి కేవలం 150లోపు పోస్టులు మాత్రమే భర్తీ కానున్నాయి. తెలుగు సబ్జెక్ట్ పోస్టులు 20, స్పెషల్ ఎడ్యుకేషన్ 6, సాంఘికశాస్త్రం 4, సంస్కృతం 3, బిఎస్ 4, ఇంగ్లీష్ 7, హిందీ 41, గణితం 4, పిఇ 53, పిఎస్ 4 పోస్టులు భర్తీ చేయనున్నటఉల ఒక అంచనా. ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారు. జిఒ 117 తీవ్ర నష్టం చేకూర్చిందని, ఫలితంగా పోస్టుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని చెబుతున్నారు. ఎన్నోఏళ్ల నుంచి ఉపాధ్యాయ కొలువుల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు ఎన్నికల ముందు హడావిడిగా అరకొర పోస్టులతో డిఎస్‌సి విడుదలకు కేబినెట్ ఆమోద ముద్ర వేయడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

117 జిఒతో ఎస్‌జిటి పోస్టులు నిల్

ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జిఒతో ఉమ్మడి జిల్లాలో ఎస్‌జిటి పోస్టులు కనుమరుగయ్యాయి. ప్రభుత్వ నిబంధనలతో కనీసం ఒక్క పోస్ట్ కూడా లేకుండాపోయింది. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు మిగులు జాబితాలో సుమారు 220 మంది ఉన్నారు. ఇక మిగిలింది కేవలం 150లోపు ఖాళీలు మాత్రమే. అయితే ఆరేళ్ల తర్వాత డిఎస్‌సి నిర్వహిస్తుండగా సుమారు 600 నుంచి 700కుపైగా కొలువుల్ని భర్తీ చేయాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యావిధానం ఫలితంగా కేవలం 150లోపు పోస్టులు మాత్రమే భర్తీ చేయనున్నారు.

నిరుద్యోగులకూ శాపంగా నూతన విద్యావిధానం

నూతన విద్య విధానం పేరుతో చేపట్టిన సంస్కరణలు నిరుద్యోగులకు శాపంగా మారాయి. ఇప్పటి వరకూ ప్రభుత్వ పాఠశాలలు మూతపడగా ఉపాధ్యాయ పోస్టులు సైతం కనుమరుగువుతున్న పరిస్థితి ప్రస్తుత డిఎస్‌సిలో తేటతెల్లమైంది. 3, 4, 5 తరగతులను సమీప పాఠశాలలో విలీనం చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ కొలువులు కేటాయించకుండా తరగతులవారీ కేటాయించారు. హేతుబద్ధీకరణ ప్రక్రియలో పదో తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు మాత్రమే తెలుగు, ఆంగ్లం మాధ్యమాల ప్రకారం వేర్వేరుగా స్థాన చలనం కల్పించారు. ఒకటి నుంచి తొమ్మిది తరగతుల వారిని ఒక మాధ్యమం ప్రకారం మార్చారు. అలాగే ఉద్యోగోన్నతుల విషయంలోనూ కనీస నిబంధనలు పాటించలేదు. ఖాళీగా ఉన్న పోస్టులను 70 శాతం వరకు ఉద్యోగోన్నతులతో భర్తీ చేసి మిగిలిన 30 శాతం పోస్టులను డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలి. అయితే దానికి భిన్నంగా అన్ని ఖాళీలను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేశారు. దీంతో పరిస్థితి తారుమారైంది. ఉపాధ్యాయ అభ్యర్థులు జిల్లాలో వేలల్లో ఉన్నప్పటికీ వందల్లోనూ పోస్టుల భర్తీ చేసే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్ర నిరాశ, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

30 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి ప్రకటించాలి

బి.గోపీమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి



కేవలం ఆరు వేల పోస్టుల భర్తీకి మెగా డిఎస్‌సి అని పేరు పెట్టడం విడ్డూరంగా ఉంది. 117 జిఒ రాక ముందు 23 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉద్యోగ విరమణ పొందిన వారితో కలిపి సుమారు 30 వేల వరకు ఉన్నాయి. 117 జిఒను రద్దు చేసి 30 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి విడుదల చేయాలి. ఎన్నికల వేళ నిరుద్యోగులకు కంటితుడుపు చర్యగా డిఎస్‌సి ప్రకటనకు కేబినెట్ ఆమోదం తెలపడం సిగ్గుచేటు.

నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం

కె.ధనుష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



డిఎస్‌సి విడుదలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయం. నిరుద్యోగులకు మాత్రం తీవ్ర అన్యాయం జరిగింది. నూతన విద్యా సంస్కరణలతో ఉపాధ్యాయ కొలువుల పోస్టులు విపరీతంగా తగ్గిపోయాయి. జిల్లాలో అనేక మంది నిరుద్యోగులు ఉన్నారు. కేవలం కంటితుడుపు చర్యగా అరొకర పోస్టులతో డిఎస్‌సి విడుదలకు ఆమోదం తెలపడం అత్యంత దారుణం. ప్రభుత్వం పునరాలోచించి మెగా డిఎస్‌సి ప్రకటించాలి.

మద్య నిషేధం మరిచారు.. కల్లుగీతను నిషేధిస్తున్నారు

నినదిస్తున్న నేతలు, ప్రతినిధులు

ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ఎన్నికల్లో గీతన్నల సత్తా చూపుతాం

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు

ముగిసిన 15వ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - తణుకు రూరల్

ప్రజల ప్రాణాలు హరించడంతోపాటు కుటుంబాలను చిన్నాభిన్నం చేసే మద్యాన్ని ఏరులైపారిస్తున్న ప్రభుత్వం కల్లుగీత వృత్తిని నిర్వీర్యం చేసే విధానాలను అవలంబిస్తూ అప్రకటిత నిషేధం విధిస్తోందని పలువురు వక్తలు విమర్శించారు. ఎపి కల్లుగీత కార్మిక సంఘం 15వ రాష్ట్ర మహాసభ కీర్తిశేషులు చిటకన వెంకటేశ్వరరావు నగర్‌లో రెండో రోజు బుధవారం ఉత్సాహపూరితంగా సాగింది. రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల నుంచి సుమారు 250 మంది గీత కార్మికులు ప్రతినిధులుగా హాజరయ్యారు. పలువురు వక్తలు మాట్లాడుతూ గీతవృత్తిని నాశనం చేయాలని చూస్తే రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి తమ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. తొలుత మహాసభ ప్రారంభ సూచికగా సంఘ పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహామూర్తి ఆవిష్కరించారు. అనంతరం కీర్తిశేషులు ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, ఉద్యమ నిర్మాత ఎస్‌ఆర్.దాట్ల, చిటకన వెంకటేశ్వరరావు, అమరులకు ప్రతినిధులు నివాళులర్పించారు. ఈ మహాసభకు అధ్యక్షవర్గంగా జుత్తిగ నరసింహామూర్తి, కామన మునిస్వామి, గుబ్బల నాగమణి, స్టీరింగ్ కమిటీగా యర్రా దేముడు, ఎం.స్టాలిన్ వ్యవహరించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గీత కార్మికుల బతుకులు మరింత దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్లలో 200 మంది గీతన్నలు చనిపోయారని, మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని విమర్శించారు. పాక్షిక అంగవైకల్యం, శాశ్వత అంగవైకల్యానికి రూ.50 వేలు చెల్లించాల్సి ఉండగా అతీగతీ లేదన్నారు. కల్లు గీత కార్మికుల కార్పొరేషన్ మూసివేసి ఐదు కులాల కార్పొరేషన్లు పెట్టిన ప్రభుత్వం గీత కార్మికులకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. చెట్లకు ఉన్న మార్కింగ్ తీసేసి చెట్లను నరికేస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లుగీత కార్మికులకు ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం ఏమిటని ప్రశ్నించారు. ఏ ప్రభుత్వం వచ్చినా మనల్ని, మన సంపదను దోచుకుంటున్నారని, అడిగితే కాదని.. పోరాడితేనే మన సమస్యలను పరిష్కరించుకోగలమని పిలుపునిచ్చారు. ఒకవైపు రాష్ట్రంలో అన్ని రంగాల ఉద్యోగులు తమ జీతాలు పెంచమని పోరాడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లకు ఒకసారి మాత్రమే జీతాలు పెంచుతామని చెప్పే ప్రభుత్వం ఐదేళ్లకు ఒక్కసారి మాత్రమే నిత్యావసరాల ధరలు పెంచగలరా అని ప్రశ్నించారు. కల్లుగీత కార్మికులకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను మన రాష్ట్రంలో ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. పక్క తెలుగు రాష్ట్రమైన తెలంగాణలో చనిపోయిన వారికి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నారని, ప్రస్తుతం రూ.10 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. నీరా ప్రాజెక్టుకు రూ.25 కోట్లు కేటాయించి వృత్తి రక్షణ కల్పిస్తుంటే జగన్ ప్రభుత్వం వీటిలో ఏఒక్కటీ అమలు చేయకుండా కల్లుగీత కార్మికులకు అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చనిపోయిన వారందరికీ తక్షణం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గాయాలు పాలైన వారికి నష్టపరిహారం చెల్లించాలని, నీరా ప్రాజెక్ట అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఐక్యతను దెబ్బతీసే కార్పొరేషన్ల వల్ల ఒరిగిందేమీ లేదు

తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.రమణ

ప్రతినిధులనుద్దేశించి కల్లుగీతకార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.రమణ మాట్లాడుతూ రాష్ట్రాలు వేరైనా, పాలకులు మారినా గీత కార్మికుల కష్టాలు మాత్రం తీరడం లేదన్నారు. తరతరాలుగా ఉపాధి కోసం చెట్లెక్కి ప్రమాదంలో చనిపోతే ఎక్స్‌గ్రేషియా ఇవ్వకపోవడం దారుణమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్మభిక్షం, ఎస్‌ఆర్.దాట్ల నాయకత్వాన అన్ని కులాల్లో ఉన్న గీత కార్మికులను ఐక్యం చేసి నిర్మించుకున్నదే ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం అని తెలిపారు. భూస్వాములకు, ఎక్సైజ్ అక్రమ దాడులకు వ్యతిరేకంగా పోరాడిన ఘనత సంఘానికి ఉందన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను వైసిపి ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. ఓట్ల కోసం కార్పొరేషన్లు పెట్టి గీతన్నల ఐక్యతను జగన్ విచ్ఛిన్నం చేశాడని దుయ్యబట్టారు.

ఎన్నికల్లో గీతన్నల సత్తా ఏమిటో చూపిస్తాం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు

రానున్న ఎన్నికల్లో గీతన్నల సత్తా ఏమిటో చూపిస్తామని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు స్పష్టం చేశారు. ఆయన కార్యదర్శి నివేదిక ప్రవేశపెడుతూ ఐక్యంగా ఉన్న వృత్తిదారులను కులాలవారీగా విడదీసిన ఘనత వైసిపిదేనన్నారు. ఐదేళ్లు అవుతున్నా గీత పాలసీ అమలు చేయలేని ఘనత ఈ ప్రభుత్వ సొంతమన్నారు. అనంతరం ఉద్యమ సీనియర్ నాయకులు, అతిథులను ఎంఎల్‌సి ఐవి చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య, ప్రొఫెసర్ జుత్తిగ చంద్రప్రసాద్, మట్టా వెంకట్, రాష్ట్ర నాయకులు సిమ్మ అప్పారావు, బత్తిన నాగేశ్వరరావు, జిల్లా నాయకులు బొక్కా చంటి, కడలి పాండు, గుబ్బల వీరరాఘవులు, మామిడిశెట్టి నాగభూషణం పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేసే వరకూ పోరాటం

భీమవరంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ఉద్యోగ, ఉపాధ్యాయుల పోరాటానికి మద్దతు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారామ్మోహన్‌రాయ్



దీక్షను ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల సమయంలో వైసిపి అమలుకానీ హామీ ఇచ్చి మోసం చేసిందని, అధికారం చేపట్టిన తర్వాత వైసిపి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ అన్ని విధాలా ఇబ్బందులకు గురిచేస్తోందని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం బకాయిలు మొత్తం విడుదల చేసే వరకూ పోరాటం సాగిస్తామని యుటిఎఫ్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. స్థానిక యుటిఎఫ్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ ప్రారంభించి మాట్లాడారు. యుటిఎఫ్ చేస్తున్న న్యాయ పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలకులు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల పక్షాన కాకుండా కార్పొరేట్ల పక్షాన ఉంటోందని విమర్శించారు. ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రూ.1,896 కోట్లు విడుదల చేయాలని, ఇప్పటికే దశలవారీ పోరాటాలు చేశామని తెలిపారు. 2023 సెప్టెంబర్‌లో చర్చలకు పిలిచి అన్ని రకాల బకాయిలు విడుదల చేస్తామని రాతపూర్వక హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. యుటిఎఫ్ పోరాటంతో పిఎఫ్‌కు సంబంధించి రూ.1,300 కోట్ల బకాయిలు ఇచ్చారని, మిగిలిన బకాయిలు మాటలేదని తెలిపారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలయ్యే విధంగా, 30 శాతం ఐఆర్ ప్రకటించే విధంగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటం మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజు అధ్యక్షత వహించారు. జిల్లా కోశాధికారి సిహెచ్ పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు కెఎస్.రామకృష్ణ ప్రసాద్, జి.రామకృష్ణరాజు, సిహెచ్.కుమార్ బాబ్జీ, డి.ఏసుబాబు, కెసిహెచ్.సాయిరామ్, రాష్ట్ర కౌన్సిలర్లు జివి రామానుజరావు, బిజెవిడి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు యాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలి

న్యాయవాదుల వంటా వార్పు

నరసాపురం: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కు యాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నరసాపురం న్యాయవాదులు చేపట్టిన ఆందోళన కొనసాగింది. బుధవారం విధులను బహిష్కరించిన న్యాయవాదులు కోర్టు సెంటర్లో 'వంటా-వార్పు' చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరసాపురం బార్ అసోసియేషన్ నాయకులు చల్లా దానయ్య నాయుడు, ఆర్‌జి.కుమార్, నారిన శ్రీనివాస్‌రావు, దొంగ నరసింహరాజు, బళ్ల శ్రీహరి, కొప్పినీడి చిట్టి పద్మజ, పులపర్తి హర్షవర్ధన్, కోపల్లె నాగశిరీష, ధనాల ఛాముండేశ్వరి, చల్లా జ్యోతి, ఓసూరి జ్యోతి మాంగళ్య మాట్లాడారు. కొత్త భూ హక్కు చట్టం వల్ల ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎటువంటి స్థిరాస్తులను అమ్మడం గానీ కొనడం గానీ చేయడానికి వీలుండదని తెలిపారు. ఎక్కడైనా భూ వివాదాలు ఏర్పడినప్పుడు సివిల్ కోర్టుల ద్వారా వాటిని ప్రజలు పరిష్కరించుకుంటున్నారని తెలిపారు. ఈ చట్టం వల్ల భూ వివాదాలను సివిల్ కోర్టుల ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని కోల్పోతారని వివరించారు. వెంటనే చట్టాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పోలిశెట్టి శ్రీరఘు రామారావు, కొతపల్లి రమేష్, చేగొండి బాలాజీ, ముత్యాల వెంకట సుబ్బారావు, కోటిపల్లి శ్రీనివాసమూర్తి, కొమ్ముల నారాయణమూర్తి, నక్కా ఆనందబాబు, ఆర్.జెస్సీకళ పాల్గొన్నారు.



వంటా వార్పు చేసి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

క్రీడల్లో రాష్ట్ర ప్రాతినిధ్యం పెంచేందుకు కృషి : విప్ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే క్రీడల్లో రాష్ట్ర ప్రాతినిధ్యాన్ని పెంపొందించే దిశగా 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్ర జిల్లాస్థాయి పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రంధి ఎంఎల్‌ఎ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి ఎస్.రామ సుందర్‌రెడ్డి కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడల్లో ఆంధ్ర ప్రాతినిధ్యాన్ని పెంచే దిశగా ముఖ్యమంత్రి ఆడుదాం ఆంధ్ర ద్వారా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో డిసెంబర్ 26 నుంచి జనవరి 2వ తేదీ వరకూ గ్రామ, వార్డు, మండల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 5,350 టీములు పోటీ పడ్డాయని, గెలుపొందిన జట్లను ఎంపిక చేసి జిల్లా పోటీలకు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం క్రీడా మైదానాలు కనుమరుగవుతున్న దశలో క్రీడలకు పూర్వ వైభవం తేవాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ క్రీడా పోటీల్లో బాగా ఆడి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. 'ఆడుదాం ఆంధ్ర' ద్వారా యువతలో క్రీడాస్ఫూర్తిని నింపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కోకో, కబడ్డీ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా స్థాయి పోటీలు ఫిబ్రవరి రెండో తేదీతో ముగుస్తాయన్నారు. జెసి రామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 535 సచివాలయాల పరిధిలో మహిళలు, పురుషులు పోటీపడి జిల్లా స్థాయికి అర్హత సాధించారన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన 5 టీములు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పోటీ పడనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, డిఎల్‌డిఒ ఎవి.అప్పారావు, తహశీల్దారు రవికుమార్, మున్సిపల్ కమిషనర్ శ్యామల పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుతున్న విప్ గ్రంధి శ్రీనివాస్

ఇళ్ల స్థల పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి

జాయింట్ కలెక్టర్ రామ సుందర్ రెడ్డి

ప్రజాశక్తి - ఉండి

పేదల ఇళ్ల స్థలాల పట్టా రిజిస్ట్రేషన్ పక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఉండి గ్రామ సచివాలయం-1 పరిధిలోని పాములపర్రు గ్రామానికి చెందిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆన్‌లైన్‌లో జెసి పరిశీలించారు. అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. జెసి మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన నూతన ఫార్మెట్ ద్వారా లబ్ధిదారులను హక్కుదారులుగా చేస్తూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పగడ్బందీగా పూర్తి చేయాలన్నారు. సరిచూసుకుని పక్కాగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. నిరుపేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషను చేసి, మంచి ఫలితాలు తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ కె.శ్రీనివాసులు రాజు, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, తహశీల్దారు ఏడిద శ్రీనివాస్, ఎంపిడిఒ ఎస్.రవీంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి చంటి రాజు

సమన్వయంతో పని చేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి - పాలకోడేరు

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని పాలకోడేరు ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపిపి చంటిరాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ముఖ్యంగా తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ నాగేంద్రకుమార్, తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఉప ఎంపిపిలు ఆడాడ లక్ష్మీతులసి, నరేష్, మండల సర్పంచుల సంఘం కార్యదర్శి బొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.



నరసాపురం : మాట్లాడుతున్న దానయ్యానాయుడు

విద్యా హక్కు చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - నరసాపురం

విద్యా హక్కు చట్టం ఆవశ్యకత గురించి అందరూ తెలుసుకోవాలని నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యానాయుడు అన్నారు. వీధి బాలల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నరసాపురం సచివాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యానాయుడు పాల్గొని మాట్లాడారు. బాల్యంలో చదువు పట్ల మాత్రమే శ్రద్ధ వహించాలని, చదువుకున్న పిల్లలు భావి భారత పౌరులుగా దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉచిత న్యాయవాదులు దొంగ నరసింహరాజు, నారిన శ్రీనివాసరావు, నక్కా ఆనందబాబు, సంస్థ సంఘ సేవకులు సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పాలకొల్లు : మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పాలకొల్లు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వీధి బాలల దినోత్సవం సందర్భంగా బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అదనపు జూనియర్ సివిల్ జడ్జి లక్ష్మీలావణ్య మాట్లాడుతూ ఆదరణ లేని బాలల పట్ల ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా వారిని సరైన మార్గంలో ప్రయాణించేటట్లు తీర్చిదిద్దేలా ఉండాలని కోరారు. బాల్యంలో ప్రతిఒక్కరూ వారి విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యపై మక్కువ చూపాలని, బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా రూపుమాపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వేదాల నాగరాజు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎఎన్.పల్లవి, పిట్ట రాజ్‌కుమార్, గణేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ శేషాద్రి, పారా లీగల్ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదినారాయణ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పంచాయతీ తొమ్మిదో వార్డు సభ్యుడు పడమటిపాలెం గ్రామానికి చెందిన కమ్యూనిస్టు పార్టీ నాయకుడు జడ్డు ఆదినారాయణకు పంచాయతీ పాలకవర్గ సభ్యులు బుధవారం నివాళులర్పించారు. జడ్డు ఆదినారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా పంచాయతీ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ జడ్డు ఆదినారాయణ మృతి తీరని లోటన్నారు. పంచాయతీ కార్యాలయంలో జడ్డు ఆదినారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీసత్యనారాయణ, సభ్యులు పొన్నపల్లి శ్రీలక్ష్మి, పెంకె చంటి, రామనాథం బుజ్జి, మద్దూరి పెద్దిరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - ఉండి

బల్లిపాడు ఘటన నిందితుడు ప్రధానోపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని మండలంలోని పాందువ్వ గ్రామ ఎంపిపి స్పెషల్ స్కూల్లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపీ మాట్లాడుతూ చిన్నారులతో అసభ్యంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్ సత్యవతి, సుప్రియ, కెవిపిఎస్ బృందం ఎం.ప్రశాంత్, ఎం.రామయ్య, డి.దుర్గాప్రసాద్, బి.రాంబాబు పాల్గొన్నారు.

'షర్మిల రాకతో కాంగ్రెస్ నేతల్లో జోష్'

ప్రజాశక్తి - పాలకొల్లు

గతేడాది కర్నాటక, తెలంగాణా రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించిందని, వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కూడా ఘనవిజయం సాధిస్తుందని కాంగ్రెస్ శ్రీకాకుళం జిల్లా ఇన్‌ఛార్జి కొలుకులూరి అర్జునరావు చెప్పారు. పాలకొల్లు కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ కుటుంబానికి చెందిన షర్మిల కాంగ్రెస్‌లోకి తిరిగి వచ్చాక కాంగ్రెస్ పార్టీకి మంచిరోజులు వచ్చాయన్నారు. ఇపుడు అసెంబ్లీకి పోటీ చేయడానికి పలువురు దరఖాస్తు చేసుకుంటున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధిలో టిడిపి, వైసిపి విఫలమయ్యాయన్నారు. అనంతరం బోనం వెంకట్రావు మాట్లాడారు.

బిసిల ద్రోహి జగన్ : ఎంఎల్ఎ నిమ్మల

ప్రజాశక్తి - పోడూరు

బిసిల ద్రోహి జగనేనని, వచ్చే ఎన్నికల్లో బిసిలంతా ఐక్యమై తరిమి కొట్టాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని పెనుమదం గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన జయహో బిసి సభలో ఆయన మాట్లాడారు. జగన్ ప్రభుత్వంలో బిసిలు అన్ని రకాలుగా దగా మోసపోయారన్నారు. ముఖ్యంగా బిసిలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులకు విదేశీ విద్య పేరుతో రూ.20 లక్షలు ఉచితంగా అందించే పథకాన్ని టిడిపి హయాంలో చంద్రబాబు అమలు జరిపితే జగన్ నిర్వీర్యం చేశారన్నారు. బిసి కార్పొరేషన్ నిర్వీర్యం చేసి రాయితీ రుణాలను, చేతివృత్తులు, కులవృత్తి వారికి లబ్ధి చేకూర్చే ఆదరణ పథకాలను రద్దు చేసిందన్నారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ మాట్లాడుతూ ఐదేళ్లలో జగన్ బిసిలకు చేసిందేమీలేదన్నారు. అనంతరం ఎంఎల్ఎ రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి రామ్మోహన్‌లను సత్కరించారు.

నేరాలు - ఘోరాలు

బైక్‌ల చోరుడు అరెస్టు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి పలు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మడుగు పోలవరం పంచాయతీ పరిధి జొన్నలపాలెం-1 గ్రామానికి చెందిన వేంద్ర చంద్రశేఖరరావు పలు ప్రాంతాలలో నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడ్డాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయా సమయాల్లో కేసులు నమోదు చేశారు. బుధవారం వీరవాసరం రైల్వే గేటు వద్ద హెల్మెట్ డ్రైవ్ నిర్వహిస్తుండగా చంద్రశేఖరరావు కంగారుగా పారిపోతుండగా అనుమానంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. వివిధ ప్రాంతాల్లో ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడినట్లు తేల్చారు. భీమవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇతనిపై ఇదే నేరంపై కేసులు నమోదయ్యాయని ఎస్ఐ తెలిపారు. ఆయా కేసుల్లో మూడు నెలల జైలు శిక్ష అనుభవించాడన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత కేరళకు వెళ్లి అక్కడ కూలీ పనులు చేసుకుంటూ జీవించాడు. తాను సంపాదించిన డబ్బు వ్యసనాలకు ఖర్చు అయిపోవడంతో మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నాడన్నారు. అతని వద్ద నుంచి ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసుల దర్యాప్తులో భీమవరం రూరల్ సిఐ సత్యకిషోర్, వీరవాసరం ఎస్ఐ రమేష్, సిబ్బందిని ఎస్పి రవిప్రకాష్ అభినందించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మాజీ సర్పంచి సూర్యనారాయణరాజుకు మాతృవియోగం

సంతాపం తెలిపిన సిపిఎం
రాజకీయ ప్రముఖుల నివాళులు

ప్రజాశక్తి - పాలకోడేరు

గొల్లలకోడేరు మాజీ సర్పంచి గాదిరాజు సూర్యనారాయణరాజుకు మాతృ వియోగం కలిగింది. సూర్యనారాయణ రాజు తల్లి అప్పల నరసమ్మ (94) వారి స్వగృహంలో మంగళవారం మృతి చెందారు. బుధవారం ఆమె స్వగ్రామమైన గొల్లలకోడేరులో అంత్యక్రియలు నిర్వహించారు. సిపిఎంతోపాటు పలు రాజకీయ ప్రముఖులు, గ్రామస్తులు అప్పల నరసమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమ్యూనిస్టు నేత, గొల్లలకోడేరు మాజీ సర్పంచి గాదిరాజు శ్రీరామరాజు అనేక ఉద్యమాల్లో పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారు. సిపిఎం భీమవరం తాలూకా కార్యదర్శిగా, భీమవరం డివిజన్ రైతు సంఘం కార్యదర్శిగా, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులుగా పని చేశారు. ఆ సమయంలో శ్రీరామరాజుకు భార్య అప్పలనరసమ్మ వెన్నుదన్నుగా ఉండి ముందుకు నడిపించడంలో కీలక పాత్ర వహించారు. కుమారుడు సూర్యనారాయణరాజు కూడా తండ్రి బాటనే ఎంచుకుని ఐదేళ్ల పాటు గ్రామ సర్పంచిగా పని చేశారు. ఇప్పటికీ గ్రామస్తులకు ఏ అవసరం వచ్చినా సహాయ సహకారాలు అందించడంలో సూర్యనారాయణరాజు ముందు వరుసలో ఉంటారు. తల్లి అప్పల నరసమ్మ మృతితో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అప్పల నరసమ్మతో కుమారుడు సూర్యనారాయణ రాజు (ఫైల్)

సంతాపం తెలిపిన సిపిఎం

కమ్యూనిస్టు నేత శ్రీరామరాజు భార్య అప్పలనరసమ్మ అకాల మృతి పట్ల సిపిఎం సంతాపం తెలిపింది. మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్), సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కమిటీ సభ్యులు కె.రాజారామ్మోహన్‌రాయ్, చింతకాయల బాబూరావు, జుత్తిగ నరసింహమూర్తి, బి.వాసుదేవరావు, బి.కల్యాణి, సిపిఎం మండల కార్యదర్శి శేషాపు ఆశ్రయ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ అప్పల నరసమ్మ మృతి అత్యంత బాధాకరమని, వారి కుటుంబానికి తీరని లోటన్నారు. అప్పల నరసమ్మ భర్త శ్రీరామరాజు కమ్యూనిస్టు నేతగా పేదల పక్షాన సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు.

సూర్యనారాయణమూర్తి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పత్రికా రంగానికి, సమాజానికి యద్దనపూడి సూర్యనారాయణమూర్తి చేసిన బహుముఖ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. ప్రముఖ పాత్రికేయుడు యద్దనపూడి సూర్యనారాయణమూర్తి స్మారక ఉత్తమ జర్నలిస్ట్ పురస్కార ప్రదాన కార్యక్రమం తాడేపల్లిగూడెం జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెస్‌క్లబ్, ఎపియుడబ్ల్యుజె జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధాల వెంకటరామారావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, గరికపాటి బాపయ్యశర్మ, ఐజెయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడారు. యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి స్మారక ఉత్తమ జర్నలిస్ట్ పురస్కారాన్ని 2023 సంవత్సరానికి న్యూస్‌టుడే బుట్టాయగూడెం విలేకరి మామిడిశెట్టి శ్రీరాంప్రసాద్‌కు అతిథులు బుద్ధాల వెంకటరామారావు, చింతకాయల బాబూరావు అందించారు. అవార్డు కింద రూ.5116 నగదు పారితోషికం, జ్ఞాపిక, నూతన వస్త్రాలు, శాలువా, పూలమాలలతో సత్కరించారు. యద్దనపూడి పేరిట సీనియర్ పాత్రికేయుల గౌరవ సత్కార కార్యక్రమంలో భాగంగా రత్నగర్భ సంపాదకుడు పివిఎ.ప్రసాద్ (ఏలూరు), ఆంధ్రజ్యోతి విలేకరి వి.నాగేశ్వరలింగమూర్తి (భీమవరం), విశాలాంధ్ర విలేకరి ఐతా సురేష్ (కుక్కునూరు)కు జ్ఞాపిక, శాలువా, నూతన వస్త్రాలు, పూలమాలలతో సన్మానించారు. తాడేపల్లిగూడెం, పాలకొల్లు, భీమవరం, బుట్టాయగూడెం, వీరవాసరం, ప్రెస్‌క్లబ్‌ల తరపున కూడా అవార్డు గ్రహీతలను, గౌరవ సత్కార గ్రహీతలను సన్మానించారు. పదో తరగతి పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన అలేఖ్యకు యద్దనపూడి కుమార్తె వైఎన్‌విఆర్.పద్మావతి తమ తల్లితండ్రుల జ్ఞాపకార్థం రూ.5116 నగదు పారితోషికం అందించి జ్ఞాపిక, నూతన వస్త్రాలతో సత్కరించారు. తొలుత యద్దనపూడి విగ్రహానికి బుద్ధాల వెంకటరామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర నాయకుడు జివిఎస్ఎన్.రాజు, జిల్లా కార్యదర్శి గజపతి వరప్రసాద్, జిల్లా కోశాధికారి ముత్యాల శ్రీనివాస్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తమ్మిసెట్టి రంగసురేష్, కార్యదర్శి గొలిమే బుజ్జిబాబు, భీమవరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కడలి వరప్రసాద్, యద్దనపూడి సుబ్బారావు కుటుంబ సభ్యులు, ఐజెయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, మున్సిపల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పి.పాపారావు, జిఎస్.శర్మ పాల్గొన్నారు.



అవార్డు అందించి సత్కరిస్తున్న వక్తలు

నామినేషన్లకు సమాచారాన్ని సమర్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని వివిధ శాఖల్లో కేంద్ర పథకాల అమలును వినూత్నంగా చేపట్టిన శాఖలు సిఎం అవార్డు నామినేషన్లకు సమాచారాన్ని సమర్పించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ప్రధానమంత్రి అవార్డ్స్ నామినేషన్లపై సంబంధిత శాఖల అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ప్రధానమంత్రి అవార్డ్ ("ది ప్రైమ్ మినిస్టర్స్ అవార్డ్స్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్") కోసం నామినేషన్లు కోరినట్లు తెలిపారు. పరిపాలనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లాకు ప్రధానమంత్రి అవార్డును ప్రధానమంత్రి చేతుల మీదుగా అందించనున్నట్లు తెలిపారు.

నిరాహార దీక్షలో న్యాయవాదులు

న్యాయవాదుల నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా పాలకొల్లు కోర్టు వద్ద న్యాయవాదుల నిరాహార దీక్షలు బుధవారం మూడో రోజు కొనసాగాయి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రతిపాదిత ల్యాండ్ చట్టాన్ని ఉపసంహరణ చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. దీక్షా శిబిరంలో ప్రెసిడెంట్ తలుపుల శ్రీనివాసరావు, సెక్రటరీ నాగరాజు, రామలింగేశ్వరరావు, ఆంజనేయులు, మురళీధరరావు, కిషోర్, సుబ్రహ్మణ్యేశ్వరరావు, రాజ్‌కుమార్, నగేష్, రంగారావు, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, ప్రసన్న కుమార్, చక్రవర్తి, సత్యనారాయణ మూర్తి, పూర్ణ, హరిగోపాల్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో కాలా అప్పారావు మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

టివి, రేడియో, సెల్‌ఫోన్ సీనియర్ టెక్నీషియన్ కాలా అప్పారావు (60) బుధవారం మృతి చెందారు. ఆయన నరసాపురం నియోజకవర్గ వశిష్ట టివి టెక్నీషియన్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఆయన గత 40 సంవత్సరాలుగా ఇదే రంగంలో కొనసాగుతూ నియోజవర్గ ప్రజలందరికీ కూడా రేడియో అప్పారావుగా పరిచితులు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నరసాపురంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మీతికి ఆ సంఘాల సభ్యులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

అప్పారావు (ఫైల్‌పొటో)

ఘనంగా ఫేర్‌వెల్ డే

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థులు ఇంటర్ స్థాయిలోనే భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని బిజిబిఎస్ మహిళా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ అన్నారు. కళాశాలలో ఇంటర్ విద్యార్థులు ఫేర్ వెల్ డే బుధవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు ఆటపాటలతో స్వాగతం పలికారు. నూలి శ్రీనివాస్ మాట్లాడుతూ కృషి, పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నీరజ, కె.అమ్మాజీ, కె.మధుశాలిని, టిఎల్ఎస్.మనోహరి, జి.రాధ పాల్గొన్నారు.

వేడంగిలో సివిల్ డే

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని వేడంగి గ్రామ సచివాలయ కార్యాలయంలో తహశీల్దార్ సమక్షంలో బుధవారం సివిల్ సర్వీస్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కె.రాంబాబు, సర్పంచి చెల్లుబోయిన శారదా, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

టిడిపిలోకి పలువురు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి సమక్షంలో దిరుసుమరు గ్రామానికి చెందిన 50 మంది వైసిపి కార్యకర్తలు బుధవారం టిడిపి చేరారు. టిడిపి జిల్లా కార్యాలయంలో వైసిపి నాయకులకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

జిల్లాస్థాయి పోటీల్లో అగ్రహారం జట్టు విజయం

ప్రజాశక్తి - ఉండి

జిల్లా స్థాయి పోటీల్లో మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం మహిళా కబడ్డీ జట్టు మరో విజయాన్ని అందుకుంది. బుధవారం భీమవరంలో జరిగిన ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ఉండి నియోజకవర్గం నుంచి అగ్రహారం మహిళా కబడ్డీ జట్టు పాలకొల్లు నియోజకవర్గం మహిళా జట్టుపై ఘనవిజయం సాధించింది. ఈ సందర్భంగా వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామ సర్పంచి సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన మహిళలు జిల్లా స్థాయిలో విజయం సాధించి తమ గ్రామం పేరును జిల్లాలో నిలపడం ఆనందదాయకమన్నారు. బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సూరవరపు వెంకటాచార్యులు మాట్లాడుతూ జిల్లా విజేతగా నిలిచే ఉండి నియోజకవర్గానికి చెందిన జట్లకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహక నగదు బహుమతికి రెండింతలు ఇస్తానని పివిఎల్ ప్రకటించడంతో క్రీడాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపాయన్నారు. పివిఎల్.నరసింహరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాస్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులకు ఎంపిటిసి సభ్యులు మున్నలూరి సువర్ణలక్ష్మీశ్రీనివాస్, మాజీ సర్పంచి మునుకోలు సింహాచలం, గ్రామ పంచాయతీ కార్యదర్శి జడ్డు వెంకట తాత నాయుడు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు ముగ్గళ్ల సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

వైఎన్ కళాశాలలో పరిశోధనలకు పెద్దపీట

ప్రజాశక్తి - నరసాపురం

విద్యావ్యవస్థలో వస్తున్న సంస్కరణలు, యువత సాధికారత సాధించేందుకు వస్తున్న సవాళ్లు అంశంపై వైఎన్.కళాశాల ఆడిటోరియంలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉన్నత విద్యా మండలి రాష్ట్రంలోని ముఖ్యమైన కళాశాలను ఎంపిక చేసి సదస్సులను నిర్వహిస్తుందని, అందులో భాగంగా జిల్లా నుంచి నాక్ ఎం గ్రేడ్_వచ్చిన వైఎన్.కళాశాలను ఎంపిక చేశారు. ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు, వైఎన్.కళాశాల సెక్రటరీ, కరెస్పాండంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు, కళాశాల అకాడమిక్, రీసెర్చ్ ఎడ్వైజర్ ఆర్‌వి.సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకారావు, పిజి డైరెక్టర్ డాక్టర్ ఎన్.చింతారావు, కళాశాల డీన్ డాక్టర్ గంధం రామకృష్ణ, ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఆర్.పార్థసారథి, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

పెనుగొండ : పెనుగొండ జెడ్‌పిహెచ్.స్కూల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎంఇఒ పి.రామకృష్ణ బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. వైసిపి నాయకుడు పలివెలి శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యా కమిటీ ఛైర్మన్ పి.శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పోతినేడి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు పి.భరత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధిక ధరలు.. యాత్రికుల విమర్శలు

మావుళ్లమ్మ వార్షిక మహోత్సవాల్లో అధిక ధరలకు ప్రసాదాల విక్రయాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం మావుళ్లమ్మ వార్షిక మహోత్సవాలను చూసేందుకు యాత్రికులు పెద్దఎత్తున వస్తుంటారు. సంక్రాంతికి ప్రారంభమైన మావుళ్లమ్మ ఉత్సవాలు నెల రోజుల పాటు నీరుల్లి పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతాయి. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల నుంచి యాత్రికులు పెద్ద ఎత్తున వస్తారు. ఆలయానికి వచ్చే ఆదాయంతో పాటు దాతలు విరాళాలు ఇస్తూ ఉంటారు. ఈ క్రమంలో యాత్రికులకు పులిహోర, లడ్డూ ప్రసాదాలు అందుబాటు ధరలకు విక్రయించాలి. కాని వాటిని అధిక ధరలకు విక్రయిస్తున్నారని యాత్రికులు విమర్శిస్తున్నారు. దీనిపై ఆలయ పాలకవర్గం స్పందించి చర్యలు తీసుకోవాలని యాత్రికులు కోరుతున్నారు.

జాతీయ పక్షి నెమలి జాతిని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - పోడూరు

భారత ప్రభుత్వం ఆమోదించిన జాతీయ చిహ్నాలను గౌరవించాలని ప్రధానోపాధ్యాయుడు కొల్లాబత్తుల సూర్యకుమార్ అన్నారు. 1963 జనవరి 31వ తేదీన నెమలిని జాతీయ పక్షిగా ప్రకటించిందన్నారు. నెమలిని జాతీయ పక్షిగా ఆమోదించిన రోజు సందర్భంగా బుధవారం చింతలగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 61వ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ భారత ప్రభుత్వం విడుదల చేసిన నెమలి చిత్రంతో ముద్రించిన పాత పది రూపాయల నోట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మగ నెమలి చల్లని గాలి వీస్తున్న సమయంలో పురివిప్పి నాట్యం చేస్తూ చూపరులను తన అందంతో కట్టిపడేస్తుందన్నారు. ప్రస్తుతం నెమలి జాతి అంతరించిపోయే ప్రమాదంలో ఉందన్నారు. జాతీయ పక్షి నెమలిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జాతీయ చిహ్నాలను ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు.

కులగణన సర్వేలో కన్వర్ట్ క్రిస్టియన్లకు అన్యాయం

ఎఫ్ఎఫ్‌సిఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - కాళ్ల

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన సర్వేలో కన్వర్ట్ క్రిస్టియన్లకు అన్యాయం జరుగుతుందని ఫ్రీడమ్ ఫర్ క్రిస్టియన్ ఇంటిగ్రేడ్ (ఎఫ్ఎఫ్‌సిఐ) రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఇస్మాయిల్ అన్నారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ ధర్నాలో ఇస్మాయిల్ మాట్లాడుతూ కులగణన విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లు కనిపించడంలేదన్నారు. వాలంటీర్ల ద్వారా కులగణన సర్వే చేయించడం బాధ్యతారాహిత్యమన్నారు. కులాల వారీ లెక్కల సేకరణ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో కొంతమంది వాలంటీర్లు ఇంటింటికి వచ్చి కులగణన సర్వే సక్రమంగా చేయడం లేదన్నారు. జిల్లాలో అనేక మండలాల్లో జరుగుతున్న కులగణన సర్వే పారదర్శకంగా జరగడం లేదన్నారు. అధికారులు, వాలంటీర్లు ఇంటింటికి తిరిగి కులగణన సర్వే నిర్వహించలేదన్నారు. సర్వేలో పొందుపరిచిన విషయాలు తెలియపరచకుండా సంబంధిత అధికారుల ప్రోత్సాహంతో వాలంటీర్లు ఫోన్లు చేసి ఒటిపి అడిగి తెలుసుకుంటున్నారన్నారు. క్రైస్తవుల కుటుంబాలకు సంబంధించిన కులగణన సర్వేలో క్రిస్టియన్ మతం అని నమోదు చేయడం లేదన్నారు. కులగణన సర్వే సక్రమంగా చేయని అధికారులు, వాలంటీర్లపై చర్యలు సుకోవాలని, కాళ్ల మండలంలో కులగణన రీ సర్వే చేపట్టాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కులగణన రీ సర్వే చేపట్టాలని ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకరరావు, తహశీల్దార్ టిఎ.కృష్ణారావు వినతిపత్రాలు అందించారు. ఈ ధర్నాలో కన్వర్ట్ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షులు పిఎస్.సుందర్రావు, కన్వీనర్ సాల్మన్‌రాజు, కార్యదర్శి కె.సురేష్‌బాబు, ఎఫ్ఎఫ్‌సిఐ కార్యదర్శి కె.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు బి.పురుషోత్తం, ఉండి సమన్వయకర్త హేమకుమార్, ఆకివీడు పొలిటికల్ ఇన్‌ఛార్జి సురేష్ పాల్, వివిధ క్రైస్తవ సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎఫ్ఎఫ్‌సిఐ నాయకులు

50 వేల పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో 50 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రకటించగా కేవలం 6100 పోస్టులతో డిఎస్‌సి వేయడానికి మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడాన్ని ఖండిస్తున్నామని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న అన్ని ఖాళీలను ప్రకటించి వాటిని నింపడానికి డిఎస్‌సి వేయాలని డిమాండ్ చేశారు. ఈ డిఎస్‌సి ద్వారా చేపట్టే నియామకాలు రెగ్యులర్‌గానే ఉండాలని, వారిని పూర్తి వేతనంతో నియమించాలని చెప్పారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉపాధి హామీ చట్టంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రతతో పాటు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంఎల్ఎ రామానాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో ఫీల్డ్ అసిస్టెంట్లు బతకలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు.

బెంగుళూరుకు ఎస్ఎన్ఎం విద్యార్థినులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 అకాడమిక్ సంవత్సరంలో భాగంగా ఆరో సెమిస్టర్ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా స్పెక్ట్రమ్ కంపెనీ బెంగళూరులో ఇంటర్న్‌షిప్ కోసం 56 మంది విద్యార్థినులు బస్సులో బయలుదేరి వెళ్లారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులకు పలు జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్.సయ్యద్, ఇంటర్న్‌షిప్ కో-ఆర్డినేటర్ టి.కృష్ణ, మెంటార్ సిహెచ్.రవికుమార్, స్టాఫ్ మెంబర్స్ పాల్గొన్నారు.

7 నుంచి నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్ర విభజన సందర్భంలో పార్లమెంట్ సాక్షిగా ఎపికి ఇచ్చిన ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోరుతూ ఈ నెల 7, 8, 9వ తేదీల్లో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద హోదా సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సిపిఐ జిల్లా సమితి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిహెచ్.రంగారావు అధ్యక్షత వహించారు. సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేసిన మోడీని గద్దె దించే సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, నెక్కంటి సుబ్బారావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, కళింగ లక్ష్మణరావు, జిల్లా సమితి సభ్యులు నామాన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బిఎస్‌పి నియోజకవర్గ కన్వీనర్‌గా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బహుజన సమాజ్ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ కన్వీనర్‌గా కొత్తపల్లి వెంకటేశ్వరరావును నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో బిఎస్‌పి జిల్లా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వరంజ్యోతి మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు అగ్రకులాల మధ్య బహుజన కులాల ప్రజలు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'వైసిపికి చరమగీతం పాడాలి'

ప్రజాశక్తి - ఆచంట

నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో సామాన్యుడి నడ్డి విరిచిన వైసిపికి చరమగీతం పాడాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని కరుగోరుమిల్లి, కందరవల్లి గ్రామంలో ప్రజల వద్దకు పితాని పాదయాత్ర బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో రాష్ట్రంలో ప్రజలందరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు, దిగమర్తి సూర్యకుమారి, టిడిపి మండలాధ్యక్షులు కేతా మీరయ్య, తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడపాటి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం'

మొగల్తూరు :నియోజవర్గంలో అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలని మాజీ ఎంఎల్ఎ బందారు మాధవనాయుడు ప్రశ్నించారు. మండలంలోని మోడీలో అసంపూర్తిగా ఉన్న వియర్ ఛానల్ నిర్మాణం, మోడీ-మొగల్తూరు గ్రామాల మధ్య ధర్భరేవు డ్రెయిన్‌పై వంతెన నిర్మించాల్సిన ప్రాంతాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి హయాంలో ఎంఎల్ఎగా ఉండగా ఇయర్ ఛానల్ నిర్మాణానికి మోడీ-మొగల్తూరు గ్రామాల మధ్య వంతెన నిర్మాణానికి రూ.10 కోట్లు, వియర్ ఛానల్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు రూ.3.58 కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన చేశామన్నారు. అనంతరం అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం ఆ నిధులతో పనులు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో బస్వాని ఏడుకొండలు, అంద్రజు రామన్న, చంపాటి సత్యనారాయణరాజు, బొక్క చక్రవర్తి, దాసరి లక్ష్మణరావు, బొక్క సత్యనారాయణ, రాజు, కొల్లాటి హరికృష్ణ, నిప్పులేటి బోసు, బల్ల సత్తిబాబు, కటికల చంద్రరావు, కుమ్మంపురుగు తాతాజీ, ఇనుకొండ కాశీ పాల్గొన్నారు.